## నిబద్ధ కమ్యూనిస్టు, సిపిఐ(ఎం-ఎల్) గుంటూరుజిల్లా నాయకులు

# కా॥ జగ్గారపు సుబ్బారావుకు జోహార్లు




**గుంటూరు జిల్లా** సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ నాయకులు కామ్రేడ్ జగ్గారపు సుబ్బారావు (84 సం॥లు) అనారోగ్యంతో చికిత్స పొందుతూ 17-12-2022న మంగళగిరిలో మరణించారు.

ఆయన 1962వ సం॥లో భట్టిప్రోలు ప్రాంతం నుండి మంగళగిరికి చేనేత కార్మికునిగా వలస వచ్చారు. కా॥ సుబ్బారావు - కా॥ విశ్వం, పాతర్ల నాగయ్యల సాహచర్యంలో తొలుత సిపిఎం రాజకీయాలను, తర్వాత కా॥ తరిమెల నాగిరెడ్డి నాయకత్వంలోని విప్లవ రాజకీయాలను స్వీకరించారు. ఆనాటినుండి కడదాకా, ఐదున్నర దశాబ్దాల కాలం అదే నిబద్ధతతో కొనసాగారు. నిర్మాణంలో పెడధోరణులకు వ్యతిరేకంగా వివిధ మలుపులలో పార్టీ నాయకత్వాన దృఢంగా నిలబడ్డారు.

చేనేత కార్మికునిగా వృత్తి చేసుకుంటూనే, చేనేత కార్మికులను సంఘటితపరచి, వారికి వర్గ రాజకీయాలను బోధించేవారు. మజూరి తదితర వృత్తి కార్మికుల సమస్యలపై మిలిటెంట్ ఉద్యమాలకు నాయకత్వం వహించి, చేనేత కార్మికుల పలు సమస్యలను పరిష్కరించుకున్నారు. ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం రాష్ట్ర కన్వీనర్‌గా, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కమిటీ సభ్యునిగా పలు ప్రాంతాల్లో చేనేత కార్మికులను సంఘటితం చేసేందుకు కృషిచేశారు.

1982వ సం॥లో రతనాల చెరువులో బంజరు భూమిని నివాస స్థలాలుగా పేదలు స్వాధీనం చేసుకునేందుకు పార్టీ నిర్ణయానుసారం ఇతర కామ్రేడ్స్‌తో కలసి కా॥ సుబ్బారావు దానికి నాయకత్వం వహించారు. ఆ సందర్భంలో రౌడీగూండాల, భూ ఆక్రమణదారుల భౌతికదాడులతోపాటు, పోలీసు నిర్బంధం, కేసులను ఎదుర్కొన్నారు. శ్రామికనగర్‌ను ఫలప్రదంగా నిర్మాణం చేసుకున్నారు. ఈ క్రమంలోనే శ్రామికనగర్ నుండి మంగళగిరి మున్సిపల్ కౌన్సిలర్‌గా నిజమైన అర్థంలో ఆయనను ప్రజలే గెలిపించుకున్నారు. కౌన్సిలర్‌గా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయటంతోపాటు పాలక పార్టీల ప్రలోభాలకు లోనుగాకుండా నిజాయితీగా నిలిచారు.

1990 తుఫాన్ సమయంలో తీవ్రంగా నష్టపోయిన చేనేత కార్మికులను కదిలించి మిలిటెంట్‌గా కార్యక్రమాలు నిర్వహించారు. టి.బి. వ్యాధికి గురై, కోలుకుని దీర్ఘకాలంగా శ్వాసకోశ సంబంధ వ్యాధితో ఇబ్బంది నెదుర్కొంటూ వున్నప్పటికీ, పార్టీ కార్యక్రమాలలో చివరిదాకా పాల్గొన్నారు. కొండమోడు టి.ఎన్.నగర్ ఇళ్ళ కూల్చివేత సందర్భంలో 1997 ఫిబ్రవరి చలికాలమైనప్పటికీ పార్టీ ఆదేశానుసారం దాదాపు నెలరోజులు అక్కడే వుండి దెబ్బతిన్న ప్రజలకు అండగా నిలిచారు.

కా॥ సుబ్బారావు కడదాకా సామాన్య జీవితం గడిపారు. కుటుంబాన్ని కూడా పార్టీ తోడ్పాటుతో తన రాజకీయాలకు అనుగుణంగా మలుచుకున్నారు. వ్యాధులబారిన పడి వచ్చిన అనేకమంది కామ్రేడ్స్‌కు ఆశ్రయమిచ్చి, వారి వ్యాధి నయం అయ్యేవరకు శ్రద్ధగా బాగోగులు చూడగలగటం, కుటుంబ సహకారమున్నందువలననే ఆయనకు సాధ్యమైంది.

పెద్దగా చదువుకోకపోయినప్పటికీ పార్టీ, సాహిత్య పత్రికలను ఆమూలాగ్రం చదివి, అర్థంకాని విషయాలను అడిగి తెలుసుకునేవారు; చర్చించేవారు. పత్రికలను, కరపత్రాలను ఎప్పుడూ దగ్గరే వుంచుకొని నిరంతర రాజకీయ ప్రచార కృషి చేసేవారు.

కామ్రేడ్ సుబ్బారావు మరణంపట్ల సిపిఐ(ఎం-ఎల్) విచారం వ్యక్తం చేస్తూ, ఆయనకు విప్లవ జోహార్లర్పిస్తోంది; వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలియజేస్తోంది.

★★★★★